క్లుప్తంగా

'రణభేరి'ని జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కదిరి: విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ చేపట్టిన రణభేరి ఉద్యమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహిర్ వలి, వైవీ సుబ్బారెడ్డి కోరారు. స్థానిక ఎంఆర్సీ ప్రాంగణంలో వారు సమావేశమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీచర్లకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. తక్షణం 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఆన్‌లైన్ అప్‌లోడింగ్ భారాన్ని తగ్గించాలని, టీచర్లను బోధనేతర పనులకు దూరంగా ఉండేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రణభేరి బైక్ జాత బుధవారం మధ్యాహ్నం కదిరి చేరుకుంటుందన్నారు. టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున, ఆజంబాషా, సునిల్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని షాజియాను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థిని షాజియా ఎంపికైందని నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శారద తెలిపారు. స్థానిక నెహ్రూనగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందించారు. అనంతపురంలో సోమవారం ఆర్డీటీ స్టేడియంలో ఉమ్మడి జిల్లా నుంచి ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షాజియా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. పాఠశాల పీడీ రాణి, ఉపాధ్యాయులు గోపి పాల్గొన్నారు.

పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదుపై సూచనలిస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్పీకుంట: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలన్నింటికీ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని ఏఓ లోకేశ్వరరెడ్డి సూచించారు. వెలిచలమల, తాటిమానుగుంత గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సెప్టెంబరు 30 లోగా పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పంట నమోదు చేయాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో రైతులు సాగు చేసిన కందిపంటను పరిశీలించి సూచనలు చేశారు.

నూతన భవనాల ప్రారంభం

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన గ్రంథాలయ, రసాయనిక శాస్త్ర ప్రయోగశాల భవనాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలకు అనుగుణంగా బోధించాలని, పండుగ వాతావరణంలో బోధన కొనసాగాలని సూచించారు. అనంతరం ఇటీవల మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్ అండర్-16 పోటీల్లో బంగారు పతకం సాధించిన లోకేశ్వరీ బంగారు, అండర్-14లో వెండి పతకం సాధించిన పర్వాన్, అండర్-13 విభాగంలో క్యాంస పతకం సాధించిన మౌలాలీని ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్ రహంతుల్లా, తహసీల్దార్ బాబురావు, ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు ,ఎంపీపీ సోమశేఖరరెడ్డి, పాఠశాల చైర్మన్ రెడ్డినాయక్ పాల్గొన్నారు.

శక్తి టీంతో బాలికలు, మహిళలకు ప్రత్యేక రక్షణ

తాడిమర్రి: శక్తి టీంలు బాలికలు, మహిళలకు రక్షణ కవచమని శక్తి టీం ధర్మవరం డివిజన్ పోలీసులు శశికళ, కరుణాకర్ భరోసా ఇచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు అరుణ ఆధ్వర్యంలో వారు బాలికలకు శక్తి టీం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కదిరి.. జ్వరాలతో బెదిరి

- మున్సిపాలిటిలో విజృంభిస్తున్న విష జ్వరాలు
- వార్డుల్లో పడకేసిన పారిశుధ్యం
- పెరిగిపోయిన దోమల బెడద
- రోగులతో కిక్కిరిస్తున్న ప్రభుత్వాస్పత్రి
- పట్టించుకొను వైద్య సిబ్బంది

కదిరి టౌన్: విజృంభిస్తున్న విషజ్వరాలతో పట్టణ ప్రజలు బెదిరిపోతున్నారు. ఏ ఇంటిలో చూసినా జ్వరబాధితులు ఉండటంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా మంచంపట్టడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలం కావడం, పారిశుధ్యం పడకేయడంతో దోమల బెడద అధికమైంది. ఫలితంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి.

అధ్వానంగా పారిశుధ్యం..

కదిరి మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వార్డుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం వేయడం, పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. మరోవైపు డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో వీధుల్లో రోడ్లపై వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పారిశుధ్య పడకేయడంతో దోమలు మోత మోగిస్తున్నాయి. సాయంత్రం ఆరు గంటల అయిందంటే చాలు దోమలు దండయాత్ర సాగిస్తున్నాయి. ఫలితంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీతోపాటు విష జ్వరాలు పెరిగిపోతున్నాయి.

క్యూ కడుతున్న రోగులు..

విషజ్వరాలు విజృంభిస్తుండడంతో ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గతంలో రోజుకు 200 నుంచి 400 ఓపీ ఉండగా ఇప్పుడు 400 నుంచి 500కు పెరిగింది. వాతావరణ మార్పులకు తోడు పారిశుధ్య లోపం కారణంగా జ్వరాలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, ప్రధానంగా దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈచిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు గౌతమ్. జీవిమాను సర్కిల్ ప్రాంతానికి చెందిన ఈచిన్నారి వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం ఎక్కువ కావడంతో ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించగా మలేరియా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆస్పత్రిలో చేరారు. వార్డులో దోమల బెడద ఎక్కువైందని, అందుకే మా బాబుకు మలేరియా వచ్చిందని చిన్నారి తల్లి వాపోయింది.



తల్లిఒడిలో పడుకున్న ఈచిన్నారి పేరు హేత్విక. తనకల్లుకు చెందిన చిన్నారికి నాలుగు రోజులుగా జ్వరం వస్తోంది. కదిరి ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించగా మలేరియాతో బాధపడుతున్నట్లు వైద్యులు తేల్చారు. దోమల బెడద కారణంగా జ్వరం వచ్చినట్లు చిన్నారి తల్లి చెబుతోంది.





కదిరి రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం



కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో క్యూకట్టిన రోగులు

మంచం పట్టిన పల్లె

ముదిగుబ్బ: మండలవ్యాప్తంగా విషజ్వరాలతో జనం వణికిపోతున్నారు. పారిశుధ్య లోపానికి వాతావరణ మార్పులు తోడవడంతో జ్వరాలు అధికమవుతున్నాయి. మండల వ్యాప్తంగా 96 గ్రామాలు, 25 గ్రామ పంచాయితీలున్నాయి. ముదిగుబ్బ, మొలకవేమల క్రాస్‌లో పీహెచ్‌సీలు పని చేస్తున్నాయి. జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రభుత్వాస్పత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకరు ఓపీలో ఉండగా మరొకరు 104 సేవలకు హాజరు కావాల్సి వస్తోంది. పీహెచ్‌సీల్లో ఒక్కరే డాక్టర్ ఉండటంతో రద్దీ ఎక్కువై చాలా మంది ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు.

దోచుకుంటున్న ల్యాబ్ నిర్వాహకులు

విష జ్వరాలతో బాధపడుతున్న వారికి ప్రతి డాక్టర్ పరీక్షలకు రాస్తున్నారు. అయితే ల్యాబ్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ రక్త పరీక్షలకు రూ.250 నుంచి రూ.300 తీసుకోవాల్సి ఉండగా రూ.500, డెంగీ పరీక్షకు రూ.500 తీసుకోవాల్సి ఉండగా రూ.900 దాకా తీసుకుంటున్నట్లు రోగులు చెబుతున్నారు. కొంతమంది డాక్టర్లు అయితే ఫోన్‌లో రక్త కణాలు తగ్గించి రిపోర్ట్ పంపండి అని మాట్లాడుకొని విష జ్వరాలు వచ్చినట్లు నమోదు చేయమని ప్రజల వద్ద సొమ్ము దోచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ముదిగుబ్బ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

పారిశుధ్య పనులు చేపట్టాలి

వార్డుల్లో కొన్ని నెలలుగా మురుగుకాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో దోమలు బెడద ఎక్కువై రోగాలు వ్యాపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టాలి.

–జగన్‌మోహన్ కదిరి

వైద్యశిబిరాల ఏర్పాటుకు చర్యలు

కదిరిలో విషజ్వరాలు అధికమయ్యాయి. దీంతో ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరిగింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జ్వరబాధితులు ఎక్కువ ఉన్న వార్డుల్లో వైద్యశిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ విజయలక్ష్మి, ఏరియా ఆస్పత్రి, సూపరింటెండెంట్

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని కలిసిన క్లస్టర్ కమిటీ సభ్యులు

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పార్టీ మున్సిపల్ క్లస్టర్ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ క్లస్టర్ కమిటీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి నివాసంలో శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ క్లస్టర్-1 కమిటీ జనరల్ సెక్రటరీ ఆద్ర నారాయణస్వామి, పాల సూరి, ఖలీల్, ఇక్బాల్, రెడ్డమ్మ, మహేష్, షాకీర్, నూర్ మొహమ్మద్, ప్రసాద్, రామాంజనేయులు, షబ్బీర్ పాల్గొన్నారు.

కేతిరెడ్డికి సత్కారం

తాడిమర్రి: వైఎస్సార్ యువజన విభాగం మండల అధ్యక్షునిగా రెండోసారి నియమితులైన సిద్దే మోహన్ రెడ్డి ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డితో కలిసి ధర్మవరంలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసి గజమాలతో సత్కరించారు. మండలంలో ఇటీవల నియమితులైన వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల మండల అధ్యక్షులు 24 మందితోనూ కలసి గ్రామాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కేతిరెడ్డి సూచించారు.

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ ధర్మవరం మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎంపికైన ఏలుకుంట్ల గ్రామానికి చెందిన లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యానిమేటర్‌ను తొలగించాలని ధర్నా

పుట్టపర్తి అర్బన్: యానిమేటర్‌ను తొలగించాలని కోరుతూ గోరంట్ల మండలం వెంకటరమణపల్లి గ్రామస్తులు మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటరమణపల్లి, నల్లనపల్లి, చెట్టిచిన్నంపల్లి గ్రామాల్లో 30 గ్రామైక్య సంఘాలకు గతంలో చౌడమ్మ యానిమేటర్‌గా పని చేసేవారన్నారు. అయితే 5 నెలల క్రితం ఆమె స్థానంలో సరస్వతి అనే మహిళ నియమించారన్నారు. ఈమె సంఘాల రికార్డులు, బ్యాంకు పుస్తకాలు తనవద్దే ఉండాలని, లోను కావాలన్నా, ఏపని కావాలన్నా తన ఇంటి వద్దకే రావాలని ఆదేశిస్తున్నారన్నారు. ఆమెను తొలగించి పాత యానిమేటర్ చౌడమ్మను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ నరసయ్యకు వినతి పత్రం అందజేశారు.

గుడిసెలకు నిప్పు

కనగానపల్లి: మండల పరిధిలోని బద్దలాపురం గ్రామంలో హంద్రీనీవా కాలువ సమీపంలో వేసిన గుడిసెలకు మంగళవారం సాయంత్రం కాలిబూడిదయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేసేందుకు వచ్చిన కూలీలు కాలువ సమీపంలో గుడిసెలు వేసుకొని ఉండేవారు. పనులు పూర్తి కావటంతో కూలీలంతా వేరేచోటికి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న గుడిసెల వద్దకు సాయంత్రం ననసకోట నుంచి తగరకుంట వైపు కారులో వెళ్తున్న కొందరు వ్యక్తులు వెళ్లారు. గుడిసెలకు వారే నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి మట్టలతో వేసిన గుడిసెలు కావటంతో పూర్తిగా కాలిపోయినట్లు పేర్కొన్నారు.

అర్బన్ ఎంఈఓ పోస్టు కేటాయించండి

కదిరి: మున్సిపల్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణకు అర్బన్ ఎంఈఓ పోస్టు కేటాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కదిరి మున్సిపాలిటీ పరిధిలోని పలు పాఠశాలల్లో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల సాధారణ బదిలీలు జరిగినప్పటికీ రిలీవర్ రాక చాలా మంది పాత పాఠశాలల్లోనే పని చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించడమో లేదంటే టీచర్ల సర్దుబాటులో భాగంగా మిగులు టీచర్లను అక్కడికి బదిలీ చేయడమో చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం తక్షణం బకాయి ఉన్న 4 డీఏలకు విడుదల చేయాలని, పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీయూ కదిరి మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, ఎన్పీకుంట ప్రధాన కార్యదర్శి వీర మహేశ్వర్, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, జనార్దన్, నారాయణస్వామి, సుధాకర్, నాగేంద్ర, ఇర్ఫాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నేతలు

ఓజోన్ సంరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం రూరల్: ఓజోన్ పొరను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఫిజికల్ సైన్స్ టీచర్ విజయకుమారి అన్నారు. మంగళవారం పాఠశాలలో వరల్డ్ ఓజోన్ డేను ఘనంగా జరుపుకున్నారు. సైన్స్ టీచర్లు విద్యార్థులతో ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పించడానికి గొడుగులతో ర్యాలీని నిర్వహించారు. సైన్స్ టీచర్లు శ్రావణ కుమారి, మనోహర్ కుమార్‌రెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర దినోత్సవం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓజోన్ పొర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత మాట్లాడుతూ ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓజోన్ పొర తగ్గిపోవడంతో అనర్థాలు జరుగుతాయన్నారు. ఓజోన్ పొర ఆవశ్యకతపై పట్టణంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత అధ్యాపకులు పాల్గొన్నారు.



ధర్మవరంలో గొడుగులతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కేసు నమోదు చేయాలని ఆందోళన

తనకల్లు: తమ ఇంటిపైకి గొడవకు వస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఈతోడుకు చెందిన వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన వెంకటరమణ అదే గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌కు మహిళా విషయంలో గతంలో వివాదం ఉంది. ఈ విషయంపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పవన్‌కుమార్ ఇటీవల మళ్లీ వెంకటరమణతో గొడవ పడ్డాడు. గొడవకు వచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు న్యాయం చేయలేదని లేదని వారు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ విషయమై ఎస్ఐ గోపికి వివరణ కోరగా ఫిర్యాదు చేస్తే విచారించి న్యాయం చేస్తామన్నారు.

నేటి నుంచి మహిళలకు ఉచిత ఆరోగ్య శిబిరాలు

బత్తలపల్లి: మండలంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళలకు ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలందరికీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

తనకల్లు: బొంతలపల్లికి చెందిన కల్పన అనే మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు... కల్పన ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. బాధితురాలి తల్లి రామలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రైల్వేస్టేషన్ పరిసరాల్లో ముమ్మర తనిఖీలు

ధర్మవరం అర్బన్: స్థానిక రైల్వేస్టేషన్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో టూ టౌన్ సీఐ రెడ్డెప్ప మంగళవారం తనిఖీలు చేశారు. ఎక్కడైనా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉందా, ఎవరైనా అనుమానితులు తిరుగుతున్నారా తదితర వాటిపై ఆరా తీశారు.

'దళిత రణభేరి' కరపత్రాలు విడుదల

ధర్మవరం రూరల్: బీఎస్పీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24న విజయవాడలో జరిగే దళిత రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ సాకే వినయ్‌కుమార్ కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం వసంతపురం గ్రామంలో కార్యక్రమ కరపత్రాలను విడుద లచేశారు. నాయకులు బండారు పుల్లన్న, సాకే దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో దోమల ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్ తెలిపారు. మంగళవారం గొట్లూరు గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో దోమల నివారణ కోసం ముందస్తుగా మెలాథిన్ పౌడర్‌ను పిచికారీ చేయించారు. సర్పంచ్ పిట్టా నరసమ్మ, నరసింహులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో ఆవు మృతి

నల్లచెరువు: పాముకాటుతో ఆవు మృతి చెందిన సంఘటన జోగన్నపేటలో చోటు చేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన పాడి రైతు ఈడిగ ప్రభాకర్‌కు చెందిన పాడి ఆవును మంగళవారం మధ్యాహ్నం సమీపంలోని పొలాల్లో మేత మేయడానికి ఎప్పటిలాగే కట్టేసి వెళ్లాడు. కాసేపటికి తర్వాత వచ్చి చూడగా ఆవు పొలంలోనే మృతి చెందింది. పాము కాటుతోనే ఆవు మృతి చెందినట్లు రైతు ప్రభాకర్ గుర్తించాడు. ఆవును కొన్ని రోజులముందు రూ.లక్ష పెట్టి కొనుగోలు చేశాశని, రోజుకు 25 లీటర్ల పాలు ఇచ్చేదని రైతు కన్నీరు మున్నీరయ్యాడు.

8 వేల పశువులకు గాలికుంటు టీకాలు

పుట్టపర్తి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లాలోని 8 వేల పశువులకు అందజేసినట్లు పశుసంవర్ధక శాఖ డీడీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం బత్తలపల్లి మండలం గంటాపురంలో ఆయన పర్యటించారు. గాలికుంటు వ్యాధికి ఇచ్చే టీకాల కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాని సిబ్బందికి సూచించారు. 3 నెలలు ఆపై ఉన్న పశువులకు అన్నింటికీ టీకాలు వేయాలన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచండి



మాట్లాడుతున్న ఎంపీపీ రఫీనాయక్

తలుపుల: మండలంలో వర్షాభావ పరిస్థితులను తట్టుకొని పంటలను సాగు చేసిన రైతులకు ఇబ్బందులకు గురిచెయ్యకుండా విత్తనాలు, యూరియా, రసాయన ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎంపీపీ రఫీనాయక్ అధికారులను సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో వైద్యాధికారులు అప్రమత్తమై ఫాగింగ్, పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో చినుకుపడితే విద్యుత్ సరఫరా ఆగిపోతోందని విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ పోలప్ప మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ప్రజా సమస్యలపై సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులను కోరారు. వైస్ఎంపీపీ మహేశ్వరరెడ్డి, ఏఓ నాగమధుసూదన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నానో యూరియాతో పంటకు మేలు



ఎన్. బడవాండ్లపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అబ్దుల్ హక్

నల్లమాడ: నానో యూరియా సాధారణ యూరియా కంటే ఎక్కువ శాతం పంటకు మేలు చేకూరుస్తుందని ఏఓ అబ్దుల్ హక్ తెలిపారు. మండలంలోని ఎన్. బడవాండ్లపల్లి వద్ద పంట పొలాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరి పైరు 25 రోజుల సమయంలో ఒకసారి, 45 రోజుల సమయంలో రెండోసారి 500 మిల్లీలీటర్ల నానో యూరియాను 100 లీటర్ల నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలని సూచించారు. మన గ్రోమోర్ మేనేజర్ నరేంద్ర, ఎంపీఈఓ అస్లాం, రైతులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: రైతులు యూరియా అధికంగా వాడడం వలన చీడపీడల నివారణ శక్తి తగ్గడమే కాకుండా, దిగుబడిపైన ప్రభావం చూపుతుందని ధర్మవరం ఏడీఏ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మంగళవారం దంపెట్ల గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఏఓ ఓబిరెడ్డి, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



తప్పిపోయిన వారిని పిలుచుకొని వచ్చిన రూరల్ పోలీసులు

ధర్మవరం రూరల్: రెండేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ, ఆమె ఇద్దరు పిల్లల కేసును ధర్మవరం రూరల్ పోలీసులు ఛేదించారు. మంగళవారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. పోతుకుంట బృందావన కాలనీకి చెందిన వడ్డే రాజేశ్వరి, వడ్డే శివకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే కొన్ని కారణాలతో వడ్డే రాజేశ్వరి తన కూతురు, కుమారుడిని తీసుకొని రెండేళ్ల క్రితం ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయింది. అప్పట్లో వడ్డే శివ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెండింగ్ కేసులను ఛేదించడంలో భాగంగా ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రూరల్ పోలీసులు ఈ కేసుపై ప్రత్యేక దృష్టిని సారించారు. తల్లితో పాటు ఇద్దరు పిల్లలు బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి వారిని తీసుకొచ్చి తహసీల్దార్ సురేష్‌బాబు ఎదుట హాజరుపరిచారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను పోతుకుంట గ్రామస్తులు అభినందించారు.